నలు దిక్కులా బోర్డులతో ఉండి నాలుగు రోడ్ల కూడలిని ఏర్పరిచాయి. ఆ నాలుగు కార్యాలయాలూ. మండలంలోని అన్ని గ్రామాల వారికి ఈ కార్యాలయాల అవసరం ఇంతా అంతా కాదు. ''పల్లెల ముంగిటకు - ప్రభుత్వం'' అనే నినాదంతో ఒక పార్టీ ఏలుబడిలో వెలసిన ఈ కార్యాలయాలు - తెలుగునాట ప్రతి ఇంటినీ తమ చుట్టూ తిప్పుకుంటున్నాయి.

ఆ ఒట్టమైన అడవిలో ఊడలు దిగిన మర్రిచెట్టులా ''మండల ప్రజాపరిషత్'' ఆఫీసు ఉత్తరాన ఉంది. వడమర ''మండల రవెన్యూ'' ఆఫీసు, వీటిని కావు కాసేట్లుగా దక్షిణాన ''రక్షకభట ఠాణా'' తుపాకుల్తో నిల్చుంది. దానికి పక్కగా తూర్పున ఇనప బీరువాలా 'బ్యాంకు' ఉంది.

దుమ్ము రేపుతూ ఆగిన బస్సులోంచి దిగిన దాలవ్పడు భుజం మీది తువ్వాలుతో మొహం తుడుచుకుని మండల రెవిన్యూ ఆఫీసుకు కాళ్లీడ్చాడు. ఉదయం పది గంటల ఎండ ఎల్డీసీ కలంలా - చక చకా వేడెక్కుతోంది.

మండల రెవిన్యూ కార్యాలయం ముందు - మూడు అశోక చెట్లు - పనిమీద వచ్చి ఉండిపోయిన రైతుల్లా నిల్చున్నాయి. ఓ చెట్టు నీడలో - దరఖాస్తులు రాయటానికీ, స్టాంపులు అమ్మటానికీ ఓ మునలాయన కళ్లద్దాలు పరిచి కాచుక్కూర్చున్నాడు. మరో చెట్టుకు ఆనించి 'అమ్మాజమ్మనీ టీ 'దుకాణం' పొగ వదుల్తోంది. మిగిలిన మూడో చెట్టు నీడన నలుగురైదుగురు రైతులు ఎమ్మార్వో కోసం ఎదురు చూస్తున్నారు.

దాలవ్పడికి తెలిసిన మొహం ఏదీ కనపడలేదు. ఆఫీసు తలుపులు తెరిచి ఉన్నా - భక్తులు లేని కోవెలలా ఉంది. అమ్మాజమ్మ టీ పాకకు నడిచేడు దాలవ్పడు. అమ్మాజమ్మ పువ్వుల నైలాను చీరా, టూబైటూ జాకెట్‌తో, పూలు ముడిచిన అందంతో మరింత వయ్యారాలు పోతోంది. దాలవ్పడిని చూసి-

''టియ్యేనా? టిఫినా?'' అడిగింది. దాలవ్పడు బదులివ్వలేదు. ఆ ప్రశ్న తనకు గాదు అనుకున్నాడు. అసలు అమ్మాజమ్మ అడిగితేనే అలా ఉంటుంది. దాలవ్పడ్ని అడుగుతూ - దారివైపు చూపులు విసురుతుంది. దాలవ్పడు పలకప్పోయేసరికి ''త్తేరింటికొచ్చిన అల్లుడ్నాగ - బెంచీ ఎక్కిపోయి ఉలకడూ, పలకడేటీ?'' అంది నవ్వుతూ. ఆ వికటానికి, పాకలో బల్ల మీద కూర్చున్న నలుగురైదుగురు నవ్వేరు. దాలవ్పడు అప్పటికి తేరుకొని ఏమిటన్నట్లు అమ్మాజీవైపు చూస్తే-

''ఏటి గావాలా?'' నవ్వును ఆపుకుంటూ అడిగింది అమ్మాజమ్మా.

''వొట్టినే! ఆఫీసు పనిమీదొచ్చేను'' దాల



వ్పడు.

''ఆఫీసు పనిమీదొచ్చేవు గాబట్టే టీ కొట్టు చూసేవు. లేపోతే సూసిన మొకమే నేటి నీది?'' అంది మళ్లీ అమ్మాజీ.

ఆ మాటకు మళ్లీ నవ్వేరు నలుగురూ. దాలవ్పడికి వాళ్లు ఎందుకు అలా నవ్వుతున్నారో, అమ్మాజమ్మ ఎందుకలా యెగతాళి చేస్తోందో తెలీదు. మామూలుగానే-

''మా ఇంటి మొగం, మా ఇంటిదాని మొగం తప్ప యీది మొగమూ, యీదిలోని మీ మొగాలు సూసెరగను'' అనేసి లేచి వెళ్ళిపోయాడు. ఆ దెబ్బకు అమ్మాజమ్మా మౌనం వహించింది. నవ్విన నలుగురూ ''సరిగ్గా కొట్టేడు దెబ్బ'' అనుకొన్నారు. ఎవరో ''అరుగో ఎమ్మార్వోగారు'' అన్నారు. ఒక్కసారిగా అక్కడ అలికిడి ప్రారంభమైంది.

ఎమ్మార్వోగారికి అందరూ దండాలు పెట్టారు. ఎవరి దండాలూ అందుకోలేదాయన. ఆయన చేతి బ్రీఫ్‌కేసును ఓ బంట్రోతు అందుకున్నాడు. మరో బంట్రోతు అయ్యగారి కుర్చీ దులిపి సర్దేడు. అయ్యగారు ఆసీనులయ్యాక ఒక్కొక్కర్నీ లోపలికి వదులుతున్నాడు బంట్రోతు. మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ - దాలవ్పడ్ని లోపలికి అనుమతించేడు బంట్రోతు.

దాలవ్పడు పట్టా కాగితాన్నీ శిస్తు రసీదుల్నీ కోర్టు నోటీసుల్నీ వాటితోపాటే కలిపి దాచిన పెండ్లిపిలుపు కార్డుల్నీ అన్నీ కలిపి కట్టిన గుడ్డ మూటని విప్పేడు. ఎమ్మార్వో ఆ కట్టలో పెండ్లి పిలుపు కార్డులు చూసి కళ్లెర్రచేసి-

''యేఁవిటిది? కవిలి కట్టంతా విప్పేవేంటి? దరకాస్తేది'' గసిరేరు.

''.... అదిగాదా! అందల పట్టా కాయితముంతాది సూడు బావ్'' అని గొణిగేడు దాలవ్పడు.

''నాకేం పని లేదనుకున్నావా - కవిలికట్టంతా వెదకడానికి? అని కేకేసి బెల్ కొట్టేరు. బంట్రోతు వచ్చి దాలవ్పడ్ని కళ్లద్దాల చెట్టుకాడకు పోయి దరఖాస్తు రాయించుకు రమ్మన్నాడు - చెట్టు నీడలోని ముసిలోడు దాలవ్పడి దగ్గర రెండు రూపాయలు తీసుకొని దరఖాస్తు రాసిచ్చేడు. దరఖాస్తుతో దాలవ్పడు తిరిగొచ్చేసరికి అయ్యగారు కుర్చీ దిగిపోయారు. లంచ్ రెస్ట్‌లో ఉన్నారు. గది ద్వారం దగ్గర స్టూలు మీద బిళ్ల బంట్రోతు జనపమావు మీద ఒంటికాలితో కునికే కొంగలా కళ్లు మూసి జోగుతున్నాడు. రెబ్బ కొండల్లోంచి వేడిగాలి దాలవ్పడి మొహమ్మీద కొట్టింది.తువ్వాలు దులిపి - అక్కడే గోడకి చేరబడ్డాడు.

ఎండ కొద్దిగా కొండ వాలుకు తిరిగే వేళకి అయ్యగారు కుర్చీలో కూర్చున్నారు. దాలవ్పడు దండాలు పెడ్తూ, కడుపు సొదంతా విన్పించేడు.

''పట్టా బావ్ ఇది. తమకంట ముందలిక్కడ పన్జేసిన ఎమ్మార్వో బావ్ ఇచ్చిన పట్టా! సర్వేయరు బావ్... కొలిసి వొప్పజెప్పారు భూమి? అదిగా భూమిల తూప్పా, డొంకా సరికి, వొరకట్టి మల్లు గట్టేసరికి నాను నలిగిపోనాను. నాలుగు పంటలు గడిసిపోనాయి. ఇప్పుడు సరిగ్గా యవసాయంకి పనికొత్తది అనేసరికి... ఆ భూమ్మీద నాకు హక్కు లేదట! ఆ పట్టా సెల్లిదాట! సూడండి బావ్... అన్నేయిం?'' అని ఇంకా చెప్పబోయేడు దాలవ్పడు. గానీ, దరకాస్తు పైకి కళ్లు విసిరిన ఎమ్మార్వో - చేత్తో సైగ జేసారు నువ్వింక వెళ్ళొచ్చు అన్నట్లు.

దాలవ్పడు ఏదో చెప్పబోతే - బెల్ మోతకు వచ్చిన బంట్రోతు దాలవ్పడ్ని బయటకు వచ్చేయమన్నాడు. బయటకు వచ్చిన దాలవ్పడు బంట్రోతుని పట్టుకొని బతిమాలితే - ''దరకాస్తిచ్చేగదా గదా. చూస్తార్లే. చూసి, తగిన చర్య తీసుకుంటారు.నీకు లెటరొస్తాదిలే. పర్లేదు. పద, పద - పకోడీ ఇప్పించు'' అని అమ్మాజీ టీ పాకకు లాక్కెళ్లాడు.

బొడ్డు కొంగులోని డబ్బులు ఖర్చు కాగా

